


యల్లమ్మ తల్లి కొలుపులు

వెల్దుర్తి: గుండ్లపాడు గ్రామంలోని యల్లమ్మ తల్లి కొలుపులలో భాగంగా గురువారం బుట్ట బంగారం మట్టిని తీసుకొచ్చారు. ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 589.00 అడుగుల వద్ద ఉంది.కుడి కాలువకు 8,280 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



పాతనందాయపాలెం(కర్లపాలెం): గ్రామంలోని కుంచాలవారి ఇలవేల్పు శ్రీ పెద అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ గురువారం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం విఘ్నేశ్వరుడు, పోతురాజు, నాగదేవత విగ్రహాలనూ ప్రతిష్ఠించారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు పూజలు చేశారు.



గుంటూరు జీజీహెచ్‌లో ధర్నా చేస్తున్న జూనియర్ వైద్య విద్యార్థులు



జూనియర్ వైద్య విద్యార్థులకు మద్దతుగా జిల్లా న్యాయవాదుల ర్యాలీ

న్యూస్‌రీల్

అత్యవసర విధులకు హాజరైన జూడాలు


గుంటూరు మెడికల్: గత పది రోజులుగా కోల్‌కతా వైద్య విద్యార్థిని అత్యాచార సంఘటనపై గుంటూరు జీజీహెచ్‌లో సమ్మె చేస్తున్న జూనియర్ వైద్యులు గురువారం రాత్రి అత్యవసర విధులకు హాజరయ్యారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఎయిమ్స్ వైద్యులు సమ్మె విరమించిన నేపథ్యంలో గుంటూరు జీజీహెచ్‌లో ఎమర్జెన్సీ వైద్య సేవలకు హాజరయ్యారు. శుక్రవారం సాధారణ వైద్య సేవలకు హాజరవుతామని జూడా సంఘం నేతలు తెలిపారు.

విజయకీలాద్రిపై తిరు నక్షత్ర మహోత్సవం



తాడేపల్లి రూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై తిరునక్షత్ర మహోత్సవాల్ని గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి మంగళా శాసనాలతో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద జీయర్ స్వామి తిరునక్షత్ర మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించామని తెలిపారు. ఉదయం 9 గంటలకు పెద్ద జీయర్‌స్వామికి అభిషేకం (తిరుమంజనం), 10:30 గంటలకు అష్టోత్తర శతనామార్చన చేశామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారని ఆయన తెలియజేశారు.

బెటాలియన్ కమాండెంట్‌గా నగేష్



మంగళగిరి: నగర పరిధిలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ నూతన కమాండెంట్‌గా నగేష్ బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకు ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై బెటాలియన్ కమాండెంట్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలువురు బెటాలియన్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలి అర్బన్: తపాలా బిళ్లల సేకరణను ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం దీన్ దయాల్ స్పర్శ్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ జి.కరుణాకర్‌బాబు గురువారం తెలిపారు. తపాలా బిళ్లలను సేకరించే 6,7,8,9 తరగతులు చదివే విద్యార్థులు అర్హులని చెప్పారు. ఎంపికైన వారికి ప్రతి నెలా రూ.500 చొప్పున ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి గుర్తింపు కలిగిన పాఠశాలల్లో చదవడంతో పాటు 60 శాతం ఉత్తీర్ణత సాధించి ఉండాలని వెల్లడించారు. వివరాలకు సమీపంలోని పోస్టాఫీసులో గానీ, www.indianport.g-ov.i n వెబ్‌సైట్‌లో గానీ సంప్రదించాలని సూచించారు.

యార్డులో 57,271 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 52,263 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 57,271 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ. 16,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి 18,700 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 8,500 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 18,800 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 19,564 బస్తాల నిల్వ ఉన్నట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

మహిళా వైద్యుల భద్రత పట్టని ప్రభుత

సాక్షి విజిట్

- జీజీహెచ్‌లో వైద్యుల భద్రత ప్రశ్నార్థకం
- పరిసరాలు అసాంఘిక శక్తులకు ఆవాసం
- ఆసుపత్రి పరిసరాల్లో తాగుబోతులు సంచారం
- కోల్‌కతా హత్యాచార ఘటన నేపథ్యంలో ఆందోళనలో వైద్యులు, సిబ్బంది
- జీజీహెచ్‌లో సమస్యల పరిష్కారానికి నిపుణుల కమిటీ ఏర్పాటు
- సమ్మెలోనే కొనసాగుతున్న జూడాలు

జిల్లాకే తలమానికమైన జీజీహెచ్‌లో భద్రత కరువైంది. సెక్యూరిటీ అంతంత మాత్రంగానే ఉంది. వైద్యులు రాత్రిళ్లు విధులు నిర్వహించడానికి భీతిల్లుతున్నారు. ఆస్పత్రి చుట్టూ వ్యాపారులు తిష్ట వేశారు. సిగరెట్లు, బీడీలు, గుట్కాలతోపాటు, మాదకద్రవ్యాలు సైతం యథేచ్ఛగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. గతంలో ఆసుపత్రిలో ఎలుకలు ఆవాసాలు ఏర్పాటు చేసుకుని పసికందు ప్రాణాలు తీశాయి. ఈ సంఘటన దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. దీంతో 2015లో ఆసుపత్రి చుట్టూ ఆక్రమణలకు గురైన షాపులను తొలగించారు. ఆవరణలో రాత్రిపూట అసాంఘిక శక్తులు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. వైద్యులు తాగునీరు తెచ్చుకునేందుకు కూడా భీతిల్లుతున్నారు. కోల్‌కతా ఆస్పత్రిలో వైద్య విద్యార్థినిపై హత్యాచారం నేపథ్యంలో గుంటూరు జీజీహెచ్‌లో డాక్టర్ల భద్రతపై సాక్షి గ్రౌండ్ విజిట్ చేసింది. పలువురు వైద్యులను పలకరించి వారి అభిప్రాయాలు తెలుసుకుంది.

– సాక్షి ప్రతినిధి, గుంటూరు/ మెడికల్





రైల్వేస్టేషన్ వైపు ఓపీ గేటు ముందు ఆగిన ఆటోలు, ద్విచక్ర వాహనాలు

- ఆసుపత్రి పరిసర ప్రాంతాలన్నీ ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో వైద్యులు, సిబ్బంది వెళ్లేందుకు నానా అగచాట్లు పడాల్సి వస్తోంది.
- ఆసుపత్రి ప్రధాన ద్వారం ఎదురుగానే ప్రైవేటు వ్యక్తుల వాహనాలు, ఆటోలు, 24 గంటలూ నిలిపివేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అంబులెన్సులు సైతం ఆసుపత్రిలోకి వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు.
- అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా ఆసుపత్రి చుట్టూ ఆక్రమించుకుని ఏర్పాటు చేసిన షాపుల్లో విక్రయాలు జరుగుతున్నాయి.
- సిగరెట్లు, బీడీలు, గుట్కాలతోపాటు, ఇతర మాదకద్రవ్యాలు సైతం విక్రయిస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

విజిట్‌లో వెలుగుచూసిన అంశాలు

- వీటి కొనుగోలు కోసం ఆసుపత్రితో సంబంధం లేని వారంతా తిరుగుతున్నారని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే ప్రమాదం ఉందని వైద్యులు వాపోతున్నారు.
- ఆక్రమణల్లో ఉన్న షాపుల్ని తొలగించకపోతే అపరిశుభ్ర వాతావరణం ఏర్పడి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.
- గతంలో ఆసుపత్రిలో ఎలుకలు ఆవాసాలు ఏర్పాటు చేసుకుని పసికందు ప్రాణాలు తీశాయి. ఈ సంఘటన దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. దీంతో 2015లో ఆసుపత్రి చుట్టూ ఆక్రమణలకు గురైన షాపులను తొలగించారు.
- మరలా నేడు ఆక్రమణలకు గురవడంతో గతంలో మాదిరిగా చెడు సంఘటనలు జరిగే ఆస్కారం ఉందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- ఆసుపత్రిలో చనిపోయిన వారి మృతదేహాల్ని తరలించేందుకు ప్రభుత్వం నుంచి మహాప్రస్థానం వాహనాలు ఉన్నాయి. రాత్రిపూట ఇవి వెళ్లకపోవడంతో ప్రైవేటు అంబులెన్సుల వారు జీజీహెచ్‌లో తిష్ట వేస్తున్నారు.



రైల్వేస్టేషన్ వైపు ఆసుపత్రి ప్రహరీ గోడ ఆనుకొని రోడ్డుపై చిరు వ్యాపారులు

- ఆసుపత్రి ప్రహరీ గోడను ఆనుకుని పలు ప్రైవేటు అంబులెన్సుల వారు పార్కింగ్ చేస్తున్నారు. వాటిల్లో పనిచేయని వాహనాలు సైతం ఉంటున్నాయి. వీటి వల్ల అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకునే ప్రమాదం ఉందని సిబ్బంది వాపోతున్నారు.



రైల్వేస్టేషన్ రోడ్డులో ఆగిన అంబులెన్సులు

వైద్యులకు వసతులు కరువు



మహిళా సీనియర్ రెసిడెంట్స్ వసతి గృహం

- జీజీహెచ్‌లో నర్సింగ్ సిబ్బంది, వైద్యులకు దుస్తులు మార్చుకునేందుకు, కొంత సేపు విశ్రాంతి తీసుకునేందుకు సరిపడా గదులు లేవు. మరుగుదొడ్లు సైతం అదే పరిస్థితి.
- తాగడానికి మంచినీరు సరిపడా దొరక్క బయట నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి.
- రాత్రి వేళల్లో బయటకు వెళ్లి మంచినీరు తెచ్చుకునేటప్పుడు కొన్ని సందర్భాల్లో వైద్య విద్యార్థులు హాస్టళ్లకు వెళ్లి వస్తున్నారు. ఈ సమయంలో చెడు సంఘటనలు చోటు చేసుకునే ప్రమాదం ఉంది.
- గతంలో పీజీ మహిళల వసతి గృహంలో సెక్యూరిటీ సిబ్బంది లేకపోవడంతో అపరిచిత వ్యక్తి సంచరించిన సంఘటన కలకలం రేపింది.

క్యాజువాలిటీలో సదుపాయాల కల్పన



సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జీజీహెచ్‌లో వైద్యుల భద్రతపై జూనియర్ డాక్టర్లు, సీనియర్ వైద్యులు, ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీలు, సెక్యూరిటీ సూపర్ వైజర్లు, వార్డెన్లతో కలిపి కమిటీ ఏర్పాటు చేశాం. క్యాజువాలిటీలో డ్యూటీ డాక్టర్ల సమస్యలను గుర్తించి 11 మరుగు దొడ్లను ప్రత్యేకంగా నిర్మించాం. క్యాంటీన్ ఏర్పాటు చేశాం. డ్యూటీ డాక్టర్ వద్దకే భోజనం తీసుకెళ్లేలా లంచ్ బాక్సులు ఏర్పాటు చేశాం. గత పది రోజులుగా జూడాలు సమ్మె చేస్తున్న నేపథ్యంలో రోగులు ఇబ్బంది పడకుండా 80 మంది వైద్యులు, 30 మంది దంత వైద్యులు, 70 మంది ఫార్మసీ విద్యార్థుల్ని డెప్యూటేషన్‌పై జీజీహెచ్‌కు తీసుకొచ్చి రోగులకు సేవలందిస్తున్నాం.

– డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్

ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లాం



జీజీహెచ్‌లో మేము ఎదుర్కొంటున్న పలు సమస్యల గురించి ఆసుపత్రి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వైద్యులకు రూమ్స్, వాష్ రూమ్స్, సీసీ కెమెరాలు లాంటి సమస్యలు వివరించాం. మా సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడంతోపాటు, ఎక్కువ శాతం పరిష్కరించారు. ఆసుపత్రి చుట్టూ పరిసరాలు ఆక్రమణలకు గురవడంద్వారా అక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రమాదం ఉంది. ముఖ్యంగా బయట నుంచి లోపలకు డ్యూటీకి వచ్చే వైద్యులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.

– డాక్టర్ రవి, జూనియర్ డాక్టర్ల సంఘం నాయకుడు

సమస్యల పరిష్కారానికి హామీ



జూనియర్ డాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో ఆసుపత్రిలో వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వినతి పత్రం అందజేశాం. సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు. వైద్యుల రక్షణ విషయంలో ఎక్కడా రాజీపడేదేలేదు. ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకునేలా జూడా తరఫున ప్రయత్నం చేస్తున్నాం.

– డాక్టర్ అహ్మద్‌బాషా సయ్యద్, జూడాల సంఘం నాయకుడు

సూపరింటెండెంట్ తనిఖీల్లో బయటపడ్డ లోపాలే సాక్ష్యం

గుంటూరు జీజీహెచ్‌లో రాత్రి వేళల్లో పరిస్థితులపై సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ఈనెల 19న తెల్లవార్లు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇందులో పలు లోపాలు బయటపడ్డాయి. ఆసుపత్రిలో మద్యం తాగిన వారు, యాచకులు తిష్టవేసి ఉండటాన్ని గుర్తించి వారికి క్లాస్ తీసుకున్నారు. రోగులకు సంబంధం లేని వారు సైతం ఆసుపత్రిలో తిరగడాన్ని గుర్తించారు. కొంత మంది ఆసుపత్రికి సంబంధం లేని వైద్య సిబ్బంది సైతం జీజీహెచ్‌లో తిరగడాన్ని గమనించారు. దీంతో సెక్యూరిటీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జీజీహెచ్ అవుట్‌పోస్ట్ పోలీసు సిబ్బందితో సైతం మాట్లాడారు. రాత్రిపూట అసాంఘిక శక్తులు తిరగకుండా పెట్రోలింగ్ చేయాలని కోరారు.

తాగునీటికి అవస్థలు



కాన్పుల విభాగంలో విధులు నిర్వహించే సమయంలో వాష్ రూమ్స్ లేక మహిళా పీజీలు చాలా ఇబ్బంది పడుతున్నారు. తాగేందుకు మంచినీరు కూడా లేకపోవడంతో హాస్టల్‌కు వెళ్లి తెచ్చుకుంటున్నాం. రాత్రిపూట హాస్టల్‌కు వెళ్లే మార్గంలో సెక్యూరిటీ, సీసీ కెమెరాలు సరిపడా లేకపోవడంతో భయాందోళనగా ఉంది. ఉన్నతాధికారులు మా సమస్యలపై దృష్టి సారించాలి.

– డాక్టర్ మౌనిక, జూడాల సంఘం నాయకురాలు



జూనియర్ వైద్య విద్యార్థులకు సంఘీభావం తెలియజేస్తున్న గుంటూరు జిల్లా న్యాయవాదులు



నాగార్జున యూనివర్సిటీలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెళ్లి పీటలపై వధువు ఆత్మహత్యాయత్నం

- పెళ్లి రద్దు చేసుకున్న ఇరు కుటుంబాల పెద్దలు
- గుంటూరు జిల్లా పెదకాకాని శివాలయంలో ఘటన

పెదకాకాని: పెళ్లి పీటలపై వధువు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గుంటూరు జిల్లా పెదకాకాని శివాలయంలో జరిగింది. వివరాల్లోకి వెళితే... పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన యువకుడికి, దుగ్గిరాల మండలం పెదపాలెం గ్రామానికి ఓ యువతికి వివాహం నిశ్చయమైంది. ఇరువైపు పెద్దలు పెదకాకానిలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి సన్నిధిలో వివాహం జరిపించేందుకు నిర్ణయించుకున్నారు. రెండు కుటుంబాల వారు బంధుమిత్రులతో గురువారం ఆలయానికి చేరుకున్నారు. ప్రాకార మండపంలో ముందుగా అనుకున్న లగ్నానికి వివాహం జరిపించేందుకు వధూవరుల్ని పీటలపై కూర్చొబెట్టారు. వివాహ బంధంలో ప్రధాన ఘట్టమైన జీలకర్ర బెల్లం పెట్టించిన అర్చకులు బంధుమిత్రులతో ఆశీర్వాద అక్షింతలు వేయించారు. అనంతరం తలంబ్రాల దుస్తులు మార్చుకునే గదిలోకి వెళ్లిన వధువు తన చేతికి ఉన్న గాజును పగులగొట్టి చేతి మణికట్టుపైన, గొంతుపైన గాయం చేసుకుంది. గమనించిన బంధువులు ఆమెను స్థానిక వైద్యుని వద్దకు తీసుకువెళ్లి చికిత్స చేయించి ఆలయానికి తీసుకు వచ్చారు. ఈ క్రమంలో తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని ప్రవళిక తేల్చి చెప్పింది. చివరకు పెద్దల చర్చల అనంతరం ఇద్దరికీ ఎటువంటి సంబంధం లేదని తెల్ల కాగితాలపై సంతకాలతో రాసుకుని వివాహాన్ని రద్దు చేసుకున్నారు. యువతి తల్లి ఆందోళనకు గురై పడిపోవడంతో ఆస్పత్రికి తరలించారు.

పారదర్శకంగా ఉచిత ఇసుక సరఫరా

- జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి
- మూడు లక్షల టన్నుల నిల్వలు
- జిల్లాలో మూడు ప్రాంతాల్లో బుకింగ్ సౌలభ్యం
- స్లాట్స్ బుకింగ్ ప్రకారమే లోడింగ్

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన విధానం ప్రకారం ప్రజలకు ఇసుక మరింత సులభంగా సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఐదే స్టాక్ యార్డ్స్‌లో అందుబాటులో ఉండగా అందులో తాడేపల్లి మండలంలోని గుండిమెడలో మూసివేసినట్లు చెప్పారు. కొల్లిపర మండలంలోని మున్నంగి పాయింట్‌లో దాదాపుగా ముగింపు దశకు వచ్చిందన్నారు. ప్రస్తుతం తుళ్లూరు మండలంలోని లింగాయపాలెం, తాళ్లాయపాలెంలో ప్రస్తుతం మూడు లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఇక నుంచి స్టాక్ యార్డ్స్ వద్ద రద్దీ తగ్గించేందుకు కొన్ని విధానాలు తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. తుళ్లూరులోని తహసీల్దార్ కార్యాలయం, గుంటూరులోని ఆర్డీఓ కార్యాలయం, తాడేపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలోనూ శుక్రవారం నుంచి ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బుకింగ్ చేసుకోవచ్చని సూచించారు రోజుకు 600 టోకెన్ల వరకు జారీ చేస్తామని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

వాహనాల రిజిస్ట్రేషన్ తప్పని సరి

కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక సరఫరా చేసేందుకు వాహనదారులు జిల్లా స్థాయి ఇసుక కమిటీలో రిజిస్ట్రేషన్ అవ్వాలని తెలిపారు. రాష్ట్రస్థాయిలో టోల్ నంబర్ 1800 599 4599, జిల్లాస్థాయిలో కంట్రోల్ రూంకు 0863– 2234301 తెలియజేయాలని సూచించారు. గ్రామ సభల నిర్వహణ శుక్రవారం నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్పీ సతీష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ పాల్గొన్నారు.

స్టాక్ యార్డుల పరిశీలన

తాడికొండ : ఉచిత ఇసుక విధానాన్ని మరింత సులభతరం చేసేందుకు శుక్రవారం నుంచి తుళ్లూరు, తాడేపల్లి మండలాల పరిధిలోని తహసీల్దార్ కార్యాలయాల్లో అనుమతులు ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆమె గురువారం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, జేసీ భార్గవ్ తేజలతో కలిసి తుళ్లూరు మండలంలోని తాళ్లాయపాలెం, లింగాయపాలెం స్టాక్ యార్డులను ఆమె పరిశీలించారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **6,000** గరిష్ఠం : రూ. **7,500**

మోడల్ ధర రూ. **6,800**

క్లుప్తంగా

కార్మిక కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డి రవీంద్రారెడ్డి

పట్నంబజారు: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో ఉన్న ఫార్మా కంపెనీలో పేలుడు సంభవించి మరణించిన ఉద్యోగ, కార్మిక కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డి రవీంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రియాక్టర్ పేలి కార్మికులు మరణించారని, వారి కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎల్జీపాలిమర్స్ బాధితులకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలబడి ప్రతి కుటుంబాన్ని ఆదుకున్న విషయాన్ని గుర్తు చేశారు. గాయపడి చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని, కూటమి ప్రభుత్వానికి కార్మికులను ఆదుకునే ఆలోచనే లేనట్టు ఉందని విమర్శించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

పొన్నూరు మున్సిపల్ కమిషనర్ నయీం బదిలీ

నూతన కమిషనర్‌గా రమేష్‌బాబు


రమేష్‌బాబు

పొన్నూరు: పొన్నూరు మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్‌ను డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో రిపోర్టు చేయమని గురువారం డీఎంఏ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన స్థానంలో కమిషనర్‌గా శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.రమేష్‌బాబు పొన్నూరుకు రానున్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి
- కేంద్రీయ విద్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి

గుంటూరు రూరల్: 15 నుంచి 18 సంవత్సరాల వయస్సుగల పిల్లలు అధికంగా బాధితులుగా మారుతున్నారని, చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి టి.లీలావతి తెలిపారు. గురువారం నల్లపాడు గ్రామంలోని కేంద్రీయ విద్యాలయంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు క్యాలెండరు యాక్టివిటీస్‌లో భాగంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ జిల్లా కార్యదర్శి టి.లీలావతి పోక్సో యాక్ట్ గురించి, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి అవగాహన కల్పించారు. రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ ప్రకారం ప్రతి చిన్నారికి చదువుకునే హక్కు ఉందని, విద్యార్థులందరూ బాగా చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని తెలిపారు. 18 సంవత్సరాల లోపు, లైసెన్స్‌లేని చిన్నారులకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. జువెనైల్ జస్టిస్ యాక్ట్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్యానెల్ అడ్వకేట్ కట్టా కాళిదాసు భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పారాలీగల్ వలంటీర్ మొహమ్మద్ రఫీ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్, సీనియర్ టీచర్ టీఎల్ ప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సృజనాత్మక నైపుణ్యంతో సామాజిక సమస్యలకు పరిష్కారం

- ఢిల్లీ టెక్నలాజికల్ వర్సిటీ స్టార్ట్‌అప్స్ ప్రొఫెసర్, మెంటర్ డాక్టర్ రాజీవ్ కపూర్
- వీఐటీ ఏపీ విశ్వ విద్యాలయంలో ఘనంగా ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవం


ఐడియా పిచింగ్‌లో తుదిపోటీకి ఎంపికైన జట్లతో అతిథులు, వర్సిటీ ప్రతినిధులు

తాడికొండ: వర్ధమాన పారిశ్రామికవేత్తలు వారిలోని సృజనాత్మక నైపుణ్యంతో సామాజిక సమస్యలను పరిష్కరించాలని ఢిల్లీ టెక్నలాజికల్ వర్సిటీ స్టార్ట్ అప్స్ ప్రొఫెసర్, మెంటర్ డాక్టర్ రాజీవ్ కపూర్ సూచించారు. తుళ్లూరు మండలం ఐనవోలు వీఐటీ ఏపీ విశ్వ విద్యాలయంలో ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజీవ్ కపూర్ మాట్లాడుతూ ఉత్పత్తి ఆవిష్కరణను తెలియజేశారు. వర్సిటీ వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి మాట్లాడుతూ వీఐటీ- ఏపీ పరిశోధన, ప్రచురణలు, పేటెంట్ల రంగంలో సాధిస్తున్న ప్రగతిని వివరించారు. ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెల్ డైరెక్టర్ డాక్టర్ అమీత్ చవాన్ మాట్లాడుతూ ఇంక్యుబేటర్ సెల్ ద్వారా విద్యార్థులు తమ ఆలోచనలను అభివృద్ధి చెందుతున్న వ్యాపారాలుగా మార్చాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఐడియా పిచింగ్ అనే కార్యక్రమంలో మొత్తం 46 జట్లు పేర్లు నమోదు చేసుకోగా అందులో 30 జట్లను ఎంపిక చేశారు. పాల్గొన్న జట్లలోని ప్రతిభను ఆధారంగా 6 అగ్రశ్రేణి జట్లను న్యాయ నిర్ణేతలు గ్రాండ్ ఫినాలేకు ఎంపిక చేయగా చివరిగా అందులో పార్క్ ఎయిడ్, ఫెమ్బో, అభయ అడ్వకేట్ అనే మూడు జట్లు విజేతలుగా నిలిచాయి. డాక్టర్ ఎస్.శాంతకుమారి, డాక్టర్ షైకు షాహిదా సాహెబ్, డాక్టర్ కాషిఫ్ బేగ్, డాక్టర్ కౌశిక్.ఎస్.భయాన్, డాక్టర్ రాజశ్రీ నాయ్, డాక్టర్ సెంతమిజ్, సెల్వి, డాక్టర్ నంద్ర ప్రభాకర్, డాక్టర్ నవనీత్ కృష్ణన్, పలువురు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించాలి

నాక్ పీర్ టీమ్ చైర్మన్ మాణిక్‌రావు సాలుంఖే



చేబ్రోలు: గ్రామీణ ప్రాంత విద్యార్థులు అధికంగా విద్యనభ్యసిస్తున్న చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఉందని నాక్ పీర్ టీం చైర్మన్ మాణిక్‌రావు సాలుంఖే అన్నారు. చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాక్ పీర్ టీం రెండు రోజుల పరిశీలన కార్యక్రమం గురువారం ముగిసింది. నాక్ టీం చైర్మన్ ప్రొఫెసర్ మాణిక్యరావు, సాలుంఖే, నాక్ బృందం సభ్యులు ప్రొఫెసర్ సంజీవకుమార్ మహాజన్, డాక్టర్ కృష్ణ, సి.మిశ్రా తదితరులు కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీదేవికి సీల్డు కవరు రిపోర్టును అందజేశారు. నాక్ కమిటీ రెండు రోజులుగా కళాశాలలో వివిధ అంశాలను పరిశీలించింది. ముగింపు సందర్భంగా చైర్మన్ మాణిక్యరావు సాలుంఖే మాట్లాడుతూ యూజీసీ నిబంధనల ప్రకారం కళాశాల నిర్వహణ ఉందన్నారు. అధ్యాపకులు, సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో మౌలిక వసతులు పెంచవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాక్ కో-ఆర్డినేటర్, పీర్ టీం సభ్యులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


ఏపీ స్టేట్ పికిల్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలు


పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఏపీ స్టేట్ పికిల్ బాల్ అసోసియేషన్, వీవీవీ హెల్త్ క్లబ్ సంయుక్తాధ్వర్యంలో ఏపీ స్టేట్ పికిల్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయని టోర్నమెంట్ నిర్వాహక కార్యదర్శి టి.అరుణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 31, సెప్టెంబర్ 1 తేదీల్లో స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని హనుమాన్ నగర్ 1వ లైన్‌లో నిర్వహిస్తామని తెలిపారు. అండర్-14, 19 బాలుర సింగిల్స్‌తోపాటు 35+, 50+ పురుషుల విభాగంలో సింగిల్స్, డబుల్స్‌లలో పోటీలు ఏర్పాటు చేశామని చెప్పారు. అనంతరం టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించామని తెలిపారు.

కౌన్సిల్ చొరవతో కదిలిన ‘సర్వే’

- నగరపాలక సంస్థ సర్వే రిపోర్టుల జారీకి చర్యలు
- జనవరి నుంచి నిలిపివేత
- స్థల రిజిస్ట్రేషన్లు, బ్యాంకు లోన్లకు సర్వే రిపోర్టే కీలకం
- ప్రజల ఇబ్బందులపై కౌన్సిల్‌లో సభ్యుల చర్చ
- చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు మేయర్ కావటి సూచన
- 21న జేసీ, టౌన్ ప్లానింగ్ అధికారులతో కమిషనర్ ప్రత్యేక సమావేశం
- కలెక్టర్ అనుమతి రాగానే సర్వే రిపోర్టుల జారీకి చర్యలు


నగరపాలక సంస్థ కార్యాలయం

నెహ్రూనగర్: ఎట్టకేలకు గుంటూరు నగరపాలక సంస్థ సర్వే రిపోర్టుల జారీకి మార్గం సుగమం అయింది. కౌన్సిల్ చొరవతో అధికార యంత్రాంగం కదిలింది. గత జనవరి నుంచి టౌన్ ప్లానింగ్ అధికారులు వివిధ కారణాలు చూపి సర్వే రిపోర్టులు ఆపేశారు. ఈ అంశం రెండు రోజుల కిందట జరిగిన కౌన్సిల్ సమావేశంలో చర్చకు వచ్చింది. మేయర్ చొరవ తీసుకుని అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. సర్వే రిపోర్టు గతంలో నగరపాలక సంస్థ ద్వారానే ఇచ్చే వారని గుర్తు చేశారు. పట్టణ ప్రణాళిక అధికారులు ఎక్కడలేని జీఓలు తీసుకువచ్చి రిపోర్టులు ఇవ్వకుండా ఆపేశారని, దీనివల్ల నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కమిషనర్ పులి శ్రీనివాసులుకు సూచించారు. దీంతో ఆయన 21న జిల్లా జేసీ భార్గవ్ తేజ్, జిల్లా రిజిస్ట్రార్ శైలజ, ఏడీ సర్వే నాగేశ్వర్‌లతో కలిసి నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సర్వే రిపోర్టులకు మార్గదర్శకాల్ని రూపొందించేందుకు చర్యలు తీసుకున్నారు.

పరిష్కార దిశగా కమిషనర్ చర్యలు

సర్వే రిపోర్టులపై కౌన్సిల్‌లో జరిగిన రచ్చపై నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పరిష్కార దిశగా అడుగులు వేశారనే చెప్పుకోవచ్చు. 21వ తేదిన జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ్, జిల్లా రిజిస్ట్రార్, ఏడీ సర్వేయర్‌తో కలిసి తన చాంబర్‌లో ప్రత్యేక సమావేశమయ్యారు. నగరపాలక సంస్థ పరిధిలో, విలీనమైన 10 గ్రామాల పరిధిలో నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌కు సంబంధించిన టీఎస్(టౌన్ సర్వే), డీ నంబర్లకు ఖాళీ స్థలాలకు నగరపాలక సంస్థ సబ్ డివిజన్ సర్టిఫికెట్లు జారీ చేసేందుకు అధికారులంతా ఏకీకృత నిర్ణయానికి వచ్చారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కలెక్టర్ ఆమోదం కోసం పంపారు. కలెక్టర్ ఆమోదం రాగానే సర్వే రిపోర్టుల జారీకి చర్యలు తీసుకుంటారు. ఇందులో భాగంగా తహసీల్దార్ కార్యాలయం నుంచి 22ఏ, 22ఈ భూ వివరాల్ని నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు సేకరించాలని అధికారులు సూచించారు.

నగరపాలక సంస్థ అధికారుల కుంటిసాకులు

గతంలో నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు సర్వే రిపోర్టు ఇచ్చేవారు. తర్వాత దానికి మంగళం పాడారు. తహసీల్దార్ కార్యాలయం ద్వారా తీసుకోవాలంటూ వైజాగ్ నగరపాలక సంస్థలో అమలవుతున్న జీవోలను అధికారులు వెతికి మరీ తీసుకువచ్చారు. దీంతో జనవరి నుంచి సర్వే రిపోర్టు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి చుక్కలు కనిపించాయి. ఈ విధంగా నగరపాలక సంస్థ పరిధిలో సుమారు 3వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలుస్తోంది.

నాన్ అగ్రికల్చర్ ల్యాండ్స్‌కు సర్వే రిపోర్టు జారీ



సబ్ డివిజన్ సర్వే సర్టిఫికెట్స్ జారీలో నగర ప్రజలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్, ఏడీ సర్వే డిపార్ట్‌మెంట్ అధికారులతో ప్రత్యేక సమావేశం అయ్యాం. అధికారుల ఏకీకృత నిర్ణయాలతో నగరపాలక సంస్థ పరిధిలోని నాన్ అగ్రికల్చర్ ల్యాండ్స్‌కు సబ్ డివిజన్ సర్వే రిపోర్టు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– పులి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ కమిషనర్

తహసీల్దార్ కార్యాలయంలో వసూళ్ల దందా?

బ్యాంకు లోన్లకు, రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు, వీఎల్‌టీ(ఖాళీ స్థల పన్ను), రోడ్డు విస్తరణ పనులకు తదితర పనులకు నగరపాలక సంస్థ సర్వేయర్లు ఇచ్చే సర్వే రిపోర్టే ప్రధానం. నగరపాలక సంస్థ అపివేయడంతో అత్యవసరంగా పని కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళితే చేతి చమురు వదులుతోంది. అక్కడి సర్వేయర్లు ఒక్కో రిపోర్టుకి రూ.20వేల నుంచి 30వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. కొంతమంది అంత ఇచ్చుకోలేక పనులు మానుకున్నారు.

రైతు సేవాకేంద్రాల్లో ఎరువులు ఏవీ?

రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి

తెనాలి: రైతు సేవాకేంద్రాల ద్వారా డీఏపీ తదితర ఎరువులను అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటకాల్వలకు పుష్కలంగా నీరు వస్తున్న తరుణంలో రైతు సేవా కేంద్రాల్లో డీఏపీ ఎరువులు లభ్యంకాక రైతులు ఇబ్బంది పడుతున్నట్టు తెలియజేశారు. ప్రైవేటు వ్యాపారులకు, సొసైటీలకు ఎరువులను కేటాయించిన ప్రభుత్వం, రైతు సేవాకేంద్రాలకు కేటాయింపులు ఇవ్వకపోవటం శోచనీయమన్నారు. ఇదే అదనుగా ప్రైవేటు వ్యాపారులు బస్తాకు రూ.50 అదనంగా వసూలుచేస్తున్నట్టు రైతులు ఆందోళన చెందుతున్నారని శివసాంబిరెడ్డి తెలిపారు. తెనాలి, పరిసర గ్రామాల రైతులు బాపట్ల జిల్లా చుండూరు మండలం వలివేరు సొసైటీకి వెళ్లి ఎరువులు తెచ్చుకుంటున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం అన్ని రైతుసేవాకేంద్రాలకు అవసరమైన ఎరువులను కేటాయించాలని విజ్ఞప్తిచేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె. విజయలక్ష్మి



గుంటూరు మెడికల్: మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మలేరియా, డెంగీ వ్యాధులను వ్యాప్తి చేసే దోమలు మంచినీళ్లలో మాత్రమే అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రజలందరూ తమ ఇళ్లలోని ఫ్లవర్ వాజులు, ఎయిర్ కూలర్లు, ఫ్రిజ్‌లు, మంచి నీళ్లకుండీలలో నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు తప్పక వాడాలని, వేపాకు పొగ వేయడం వల్ల, దోమలను తరిమి వేయవచ్చని తెలిపారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో కొబ్బరి బోండాల చిప్పలు, టైర్లు, తాగిపడవేసిన టీ కప్పుల్లో వర్షపు నీరు నిల్వ ఉండ కుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వర పీడితులు సమీపంలోని అర్బన్ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వైద్యుల సలహా మేరకు చికిత్స తీసుకోవాలని సూచించారు.

విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి

- గుంటూరు డీవైఈఓ పి.వెంకటేశ్వరరావు
- పరీక్షా భవన్‌లో ఇన్‌స్పైర్ మనక్ విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన సన్నద్ధతపై జిల్లాస్థాయి ఓరియెంటేషన్


ఓరియెంటేషన్‌కు హాజరైన ఉపాధ్యాయులతో రిసోర్స్ పర్సన్లు


గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులను ఇన్‌స్పైర్ చేసి భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు అన్నారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని జిల్లా పరీక్ష భవన్‌లో గురువారం ఇన్‌స్పైర్ మనక్ విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన సన్నద్ధతపై ప్రభుత్వ ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు జిల్లాస్థాయిలో ఓరియెంటేషన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీవైఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇన్‌స్పైర్ మానక్‌ను వేదికగా చేసుకుని అన్వేషణాత్మక ఆలోచనలు కలిగిన విద్యార్థులను శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఆరు నుంచి పది వరకు చదువుతున్న విద్యార్థుల చిట్టిబుర్రల్లో గట్టి ఆలోచనలు ఉంటాయని, వాటికి పదును పెట్టడం ద్వారా బాల శాస్త్రవేత్తలు తయారవుతారన్నారు. గుంటూరు జిల్లాలోని ప్రతి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు నామినేషన్లు, ఉన్నత పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు తప్పనిసరిగా సమర్పించాలన్నారు. ఈసందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 10 ఏళ్లపాటు సైన్స్ అధికారిగా సేవలందించిన మధుకుమార్‌ను సైన్స్ ఉపాధ్యాయులు సన్మానించారు. ఆర్.శివనాగేశ్వరరావు, అప్పారావు, శివశంకర్, మల్లిఖార్జునరావు, గంగాధర్, జాకీర్ హుస్సేన్ రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించగా, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, పల్నాడు జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్, ఎంఈఓ బీవీ రమణయ్య, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుంటూరు రేంజ్‌లో మరో 13 మంది సీఐలు బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో మరో 13 మంది సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
గన్నవరపు శ్రీనివాసరావు	పీటీసీ, ఒంగోలు	ప్రత్తిపాడు సర్కిల్, గుంటూరు జిల్లా
షేక్.నాగూర్‌మీరాసాహెబ్	ఇంటెలిజెన్స్	మేడికొండూరు పీఎస్, గుంటూరు జిల్లా
ఇ.నారాయణ	ఇంటెలిజెన్స్	దిశ-1, గుంటూరు జిల్లా
బి.బ్రహ్మయ్య	రేంజ్ వీఆర్, గుంటూరు	సత్తెనపల్లి టౌన్ పీఎస్, పల్నాడు జిల్లా
ఎం.హైమారావు	రేంజ్ వీఆర్, గుంటూరు	నరసరావుపేట 2 టౌన్ పీఎస్, పల్నాడు జిల్లా
ఆర్.సురేష్‌బాబు	ఎస్సీ, ఎస్టీ సెల్-1, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా	రేపల్లె రూరల్ సర్కిల్, బాపట్ల జిల్లా
పీవీ ఆంజనేయులు	రేంజ్ వీఆర్, గుంటూరు	వేమూరు సర్కిల్, బాపట్ల జిల్లా
బి.నాగభూషణం	రేంజ్ వీఆర్, గుంటూరు	చీరాల 2 టౌన్ పీఎస్, బాపట్ల జిల్లా
షేక్.ఖాజావలి	మహిళా పీఎస్, ప్రకాశం జిల్లా	కనిగిరి సర్కిల్, ప్రకాశం జిల్లా
సీహెచ్.ప్రభాకర్‌రావు	రేంజ్ వీఆర్, గుంటూరు	ఎర్రగొండపాలెం సర్కిల్, ప్రకాశం జిల్లా
ఆర్ఎస్.కిషోర్‌కుమార్	మెరైన్	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా 5 టౌన్ పీఎస్
బి.పాపారావు	రేంజ్ వీఆర్, గుంటూరు	కావలి రూరల్ సర్కిల్, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా
జె.శ్రీనివాస్	రేంజ్ వీఆర్, గుంటూరు	గూడూరు 2 టౌన్ పీఎస్, తిరుపతి జిల్లా

వీవీఐటీలో ‘స్పర్థ-2కే24’ ప్రారంభం


స్పర్థ-2కే24ను ప్రారంభించిన సిర్మానా ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ టీం లీడ్ డాక్టర్ రాజేష్ బండికల్ల


పేర్లు నమోదు చేయించుకుంటున్న విద్యార్థులు

పెదకాకాని: విద్యార్థులు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ సిర్మానా, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ టీమ్ లీడ్ డాక్టర్ రాజేష్ బండికల్ల అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో అసోసియేషన్ ఫర్ కంప్యూటింగ్ మిషనరీ(ఏసీఎం) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రెండురోజులపాటు నిర్వహించనున్న స్పర్థ-2కే24 సాంకేతిక సదస్సును గురువారం డాక్టర్ రాజేష్ బండికల్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు నూతన సాంకేతితను, నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 36 కళాశాలల నుంచి 210 గ్రూపులు, 4278 మంది విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొననున్నారన్నారు. రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమములో అల్గో అరేనా, ట్రెజర్ ట్రూపర్, గేమ్ ఆఫ్ కోడ్, రిడిల్ ర్యాం పేజ్ వంటి అంశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నారు. ఈ సదస్సుకు హాజరైన విద్యార్థులకు అత్యాధునిక వర్చువల్ రియాలిటీ సాంకేతికతతో ఆటలు ఆడించారు. ఈ వేడుకలలో భాగంగా సాంకేతిక నైపుణ్యాల పెంపుదల, సామాజిక మాధ్యమాల వినియోగం వంటి అంశాలపై విద్యార్థులకు సదస్సులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఏసీఎం క్రానికల్ 2024 పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.